## ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా

# నా గెలుపును ఆపలేరు



- రూ.3 వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా
- బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నన్ను గెలిపిస్తాయి..
- ఏజెన్సీకి మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీని తీసుకొచ్చా..
- టూరిస్టులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు..
- 'నమస్తే'తో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు

'అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా కొత్తగూడెం నియోజకవర్గం దూసుకుపోతున్నది. నాడు డివిజన్ కేంద్రంగా ఉన్న కొత్తగూడెం నేడు జిల్లా కేంద్రమైంది. రూ.3 వేల కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టాను. ప్రతి పల్లెలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాను. పాల్వంచ, కొత్తగూడెం జంట పట్టణాలుగా అభివృద్ధి చేశాను. కొత్తగూడేనికి మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ తీసుకొచ్చాను.. ఈ అభివృద్ధి పనులే నన్ను గెలిపిస్తాయి.' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. 'నమస్తే' చిట్ చాట్‌లో పలు విషయాలు వెల్లడించారు.

**- భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ)**

**నమస్తే ఇంటర్వ్యూ** INTERVIEW

**నమస్తే :కొత్తగూడెంలో చెప్పుకోదగిన అభివృద్ధి పనులు ఏమున్నాయి ?**

**వనమా:** కొత్తగూడెం, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాలను అన్నిరంగాల్లో అభివృద్ధికి కేరాఫ్ చేశాను. కొత్తగూడెంలో మెడికల్ కాలేజీ కావాలని సీఎంను కోరగానే మంజూరు చేశారు. మంజూరయ్యాక సీఎం కేసీఆర్ ఫోన్ చేసి మరీ చెప్పారు. అడిగింది ఇస్తున్నాం అని. వైద్య విద్యను ఏజెన్సీని తీసుకొచ్చాను.

**నమస్తే :గతంలో లక్ష మందికి ఇండ్లు కట్టిచ్చామన్నారు. ఈ ఐదేళ్లలో ఎంత మందికి ఇండ్ల పట్టాలు ఇచ్చారు ?**

**వనమా :** నేను గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసినప్పుడు లక్ష మందికి ఇండ్లు కట్టించి ఇచ్చాను. కొత్తగూడెంలో దీర్ఘకాలికంగా ఉంటున్న వారికి క్రమబద్ధీకరణ పట్టాలు ఇచ్చాను. సింగరేణి నిర్వాసితులకు ఇంటి స్థలంతో పాటు ఇండ్ల పట్టాలు ఇచ్చాను. పాత కొత్తగూడెంలో డబుల్ బెడ్ రూం ఇండ్లు, స్థలం లేని వారికి జాగా ఇచ్చాను. వారికి గృహలక్ష్మిలో అవకాశం కలిించాను.

**నమస్తే: ప్రచారంలో మీకు జనాదరణ ఎలా ఉంది ?**

**వనమా :** సీఎం కేసీఆర్ నా మీద నమ్మకంతో ఇంటికి పిలిచి మరీ భరోసా కల్పించారు. మొదటి లిస్టులోనే నా పేరు ప్రకటించారు. అదే నాకు కొండత ధైర్యాన్ని ఇచ్చింది. అప్పుడే నా గెలుపు ఖాయమైందని భావించాను. ఎన్నికల ప్రచారంలోకి వెళ్లినప్పుడు ప్రజలు నన్ను ఆదరిస్తున్నారు. మహిళలు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్నారు. ప్రతి కార్యకర్త 'జై వనమా' అంటున్నారు.

**నమస్తే : ఎన్నికల్లో విజయావకాశాలు ఎలా ఉన్నాయి ?**

**వనమా:** ప్రజలు నావైపే ఉన్నారు. నన్నే మళ్లీ గెలిపిస్తారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే నన్ను గెలిపిస్తాయి. సర్కార్ నియోజకవర్గంలో అర్హులందరికీ పోడు రైతులు పట్టాలు ఇచ్చింది. గిరిజనేతరులకూ పోడుపట్టాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. వారందరీ మద్దతు మాకుంటుందని విశ్వసిస్తున్నాం. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కొత్తగూడెం ప్రచారానికి వచ్చారు. వారి సభలు, రోడ్ షోలు మాకు కలిసివస్తాయి.

**నమస్తే : ఎన్నికల్లో మీకు ప్రత్యర్థులు ఎవరు అనుకుంటున్నారు ?**

**వనమా:** నాకు ఎన్నికల్లో పోటీలో ఎవరూ లేరు. రాలేరు. మెజారిటీతో గెలిచేటప్పుడు ప్రత్యర్థులు ఎవరుంటారు. టూరిస్టులుగా వచ్చే వారిని జనం నమ్మరు. ఇతర పార్టీలకు నియోజకవర్గంలో క్యాడర్ లేదు. జనం ఎందుకు నమ్ముతారు. అందుకే అందరూ వనమానే బెటర్ అని జై కొడుతున్నారు. నేను భారీ మెజారిటీతో గెలుస్తాను. 50 వేలకుపైగా మెజారిటీ వస్తుంది. కాంగ్రెస్, సీపీఐలో క్యాడర్ అంతా బీఆర్ఎస్‌లో చేరింది. దీంతో బీఆర్ఎస్ బలం పెరిగింది.

## యువకుడి దారుణహత్య



నవీన్(ఫైల్)

బూర్గంపహాడ్, నవంబర్ 22: మహిళ విషయంలో ఇద్దరి మధ్య కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఆ గొడవ చిలికి చిలికి హత్యకు దారి తీసింది. చివరికి ఇద్దరిలో ఒకరు బలయ్యాడు. వ్యక్తి చేతిలో మరో యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో బుధవారం ఉదయం వెలుగు చూసింది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ అఫ్రీది అనే వ్యక్తి చికెన్‌షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన మిరియాల నవీన్(23) కూలీ చేస్తున్నాడు. అఫ్రీదితో సంబంధం నెరపుతున్న ఓ మహిళతో నవీన్ కూడా సన్నిహితంగా మెలుగుతున్నాడు. అఫ్రీది ఇది గమనించి నవీన్‌ను అనేకసార్లు హెచ్చరించాడు. అయినా నవీన్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. అఫ్రీది దీంతో ఎలాగైనా నవీన్‌ను హతమార్చాలని నిర్ణయించాడు. మంగళవారం రాత్రి తన ఇంటి ముందు నుంచి నవీన్ వెళ్తుండగా అఫ్రీది గడ్డపారతో తలపై దాడి చేసి అక్కడి నుంచి ఉడాయించాడు. ఘటనలో తీవ్రగాయాలపాలైన నవీన్ మృతిచెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అఫ్రీదిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

## పోలింగ్ కేంద్రాల సందర్శన

కొణిజర్ల, నవంబర్ 22: మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం కలెక్టర్ వీపీ గౌతమ్ పరిశీలించారు. ఈ నెల 30న జరుగనున్న నేపథ్యంలో పోలింగ్‌కు ప్రిసైడింగ్, ఎన్నికల అధికారులు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పర్యటనలో తహసీల్దార్ మహమ్మద్ తఫాసుల్ హుస్సేన్, ఎంపీడీవో మహాలక్ష్మి ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్




మాజీ మంత్రి తుమ్మల

## నన్ను చంపేందుకు కుట్ర చేస్తున్నారు

**విశ్రాంత పోలీస్ అధికారి సుభాష్ చంద్రబోస్**



మాట్లాడుతున్న విశ్రాంత పోలీస్ అధికారి

ఖమ్మం, నవంబర్ 22: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయన కుమారుడు తుమ్మల యుగంధర్ తనను చంపే ఆలోచన చేస్తున్నారని విశ్రాంత పోలీస్ అధికారి సుభాష్ చంద్రబోస్ ఆరోపించారు. ఖమ్మం నగరంలోని ఆయన స్వగృహంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన ఇంట్లో డబ్బులు ఉన్నట్లు భావించి మంగళవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ నాయకులు చావా నారాయణరావు, కమర్తపు మురళి, నరేందర్, మందడపు మనోహర్, నాగుల్‌మీరా, సాధు రమేశ్‌రెడ్డితో సుమారు పాటు 200 మంది తనతోపాటు తన కుటుంబ సభ్యులపై దాడి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతల బెదిరింపులతో తనతో పాటు స్థానిక కుటుంబాలూ ఇబ్బంది పడ్డాయన్నారు. తాను వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వచ్చి కాపాడారన్నారు. దాడికి పాల్పడిన వారిపై తాను నగర పరిధిలోని ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. ఈ కుట్రలకు మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు, ఆయన కుమారుడు తుమ్మల యగంధరే కారణమన్నారు. కొద్దిరోజుల క్రితం తుమ్మల స్వయంగా తనకు కాల్ చేసి బెదిరించారన్నారు. సీపీఐ సీనియర్ నేత పువ్వాడ నాగేశ్వరరావు కుటుంబంతో నాకు 35 ఏండ్ల అనుబంధం ఉందన్నారు. ఉద్యోగ విరమణకు మరో రెండు నెలల సమయం ఉండగానే, ఉద్యోగానికి రాజీనామా చేసి మరీ పువ్వాడ అజయ్‌కుమార్ గెలుపుకోసం పనిచేస్తున్నానన్నారు. బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్‌కుమార్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి తుమ్మల ఇంట్లో ఎన్నికల అధికారులు తనిఖీలు చేస్తే ఏ ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త ఆయన ఇంటికి వెళ్లలేదన్నారు. కానీ విశ్రాంత పోలీస్ అధికారి సుభాష్ చంద్రబోస్ ఇంటికి ఎందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు వచ్చారన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు మాట్లాడుతూ.. మాజీ మంత్రి తుమ్మల ప్రశాంతంగా ఉన్న ఖమ్మం నగరంలో అలజడి రేపుతున్నారని ఆయన మండిపడ్డారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

**క్యాబిన్‌లో మంటలు వచ్చి క్లీనర్ మృతి**

మామిళ్లగూడెం, నవంబర్ 22: ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టిన ఘటనలో క్లీనర్ మృతిచెందిన ఘటన ఖమ్మం నగరంలో చోటుచేసుకున్నది. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైరా నుంచి సూర్యాపేట వైపు లోడుతో వెళుతూ బుధవారం లారీ బైపాస్ రోడ్డు పక్కన ఆగింది. ఇదే సమయంలో వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఘటనలో వెనుక ఢీకొట్టిన లారీ క్యాబిన్‌లో మంటలు చెలరేగాయి. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన క్లీనర్ గురప్ప(28) అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే డ్రైవర్‌ను బయటకు తీసి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అన్నం ఫౌండేషన్ సాయంతో క్లీనర్ మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడిని ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల వాసిగా పోలీసులు తెలిపారు.

## మద్యం సీసాల స్వాధీనం

రామవరం, నవంబరు 22: చుంచుపల్లి మండల పరిధిలోని రుద్రంపూర్ సెంటర్‌లోని ఓ బెల్టుషాపులో బుధవారం చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సకినాల రమేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. రూ.19 వేల విలువ గల మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ జయశ్రీ, ఎస్సైలు అశోక్, రమేశ్, ఏఎస్సై కృష్ణారావు పాల్గొన్నారు.

## గుండెపోటుతో బీఆర్ఎస్ కార్యకర్త మృతి

**మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా**

అశ్వారావుపేట రూరల్, నవంబర్ 22: బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో అపశ్రుతి చోటుచేసుకున్నది. మల్లాయిగూడెంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఓ కార్యకర్త గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. తెలిసిన వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు బుధవారం స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచార రథంతో పాటు పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గన్నమనేని రమేశ్ (46) ఉన్నారు. ఈక్రమంలో రమేశ్ గుండె పోటుకు గురై ప్రచార రథంలోనే కుప్పకూలారు. కార్యకర్తలు వెంనటే ఆయనకు సీపీఆర్ చేసి అశ్వారావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే రమేశ్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రమేశ్ మృతదేహానికి ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు నివాళి అర్పించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని సంతాపం తెలిపారు. ఆయన వెంట నాయకులు భూక్యా ప్రసాదరావు, జల్లిపల్లి శ్రీరామూర్తి, యూఎస్ ప్రకాశరావు, మందపాటి రాజమోహన్‌రెడ్డి, గొడపర్తి వెంకటేశ్వరరావు, చందా లక్ష్మీనర్సయ్య ఉన్నారు.



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి